## ధాన్యం కొనుగోలు పద్ధతులపై అవగాహన



శిక్షణలో మాట్లాడుతున్న ఫైసల్ హుస్సేన్

తాడ్వాయి, అక్టోబర్ 26 : కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని పౌరసరఫరాశాఖ అధికారి ఫైసల్ హుస్సేన్ సూచించారు. వానకాలం సీజన్ ధాన్యం కొనుగోలు చేసే పీపీసీ సెంటర్ ఇన్‌చార్జిలకు, బుక్ కీపర్, వ్యవసాయశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాల మేరకు మండలకేంద్రంలోని రైతువేదికలో శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫైసల్ హుస్సేన్ కొనుగోలు కేంద్రాల నిర్వహణపై అవగాహన కల్పించారు. కొనుగోలు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, చెల్లింపు విధానాలు, దొడ్డు రకం, సన్న రకాలను గుర్తించడం, తేమశాతాన్ని గుర్తించడం తదితర విషయాలపై వివరించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే ట్యాగింగ్ చేసి మిల్లులకు పంపించాలన్నారు. రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, పౌరసరఫరాలశాఖ అధికారులు, ఆదర్శరైతులు పాల్గొన్నారు.

## రాజేశ్‌పై దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు

ములుగు, ఆగస్టు26(నమస్తేతెలంగాణ) : ములుగు మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన దూమల రాజేశ్‌పై ఈ నెల 23వ తేదీన దాడి చేసిన ఐదుగురిపై శనివారం కేసు నమోదైనట్లు ములుగు ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈ నెల 23న రాత్రి 8గంటల సమయంలో గ్రామానికి చెందిన ల్యాద శ్యామ్‌రావు, గోల్కొండ రవి, బక్కి నాగరాజు, బోరు శ్రీను, గోపి అనే ఐదుగురు దూమల రాజేశ్‌ను అకారణంగా కొట్టారని, దెబ్బలు తట్టుకోలేక, అవమానం భరించకలేక తన భర్త రాజేశ్ మనస్థాపం చెంది తమ కారులోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడని రాజేశ్ భార్య మానస ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. వరంగల్ ఎన్ఎస్ఆర్ దవాఖానలో రాజేశ్ చావు బతుకుల మధ్య చికిత్స పొందుతున్నాడని, దాడి చేసిన ఐదుగురిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని తనకు న్యాయం చేయాలని మానస ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రెండు ఇసుక లారీలు పట్టివేత

### డ్రైవర్లతో పాటు యజమానిపై కేసు నమోదు

ఏటూరునాగారం, అక్టోబర్ 26 : ఎలాంటి వేబిల్లులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. ఏఎస్సై సుబ్బారావు నేతృత్వంలో శనివారం మండల కేంద్రంలో వాహన తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో పెట్రోల్ బంక్ వద్ద రెండు (టీఎస్07యూజీ2969), (టీఎస్03 యూబీ0366) నంబర్ గల రెండు లారీలు ఎలాంటి వే బిల్లులు లేకుండా వస్తుండగా గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. వాజేడు మండలం బీమారం ఇసుక క్వారీ నుంచి ములుగు సమీపంలోని జంగాలపల్లికి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. లారీ డ్రైవర్లు శ్రీరాం నరేశ్, వీణవేణి రాజ్‌కుమార్, యజమాని లంకె శ్యాంపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. తనిఖీల్లో ఏఎస్సై సుబ్బారావుతోపాటు కానిస్టేబుల్స్ విజయ్, హరీశ్‌లు పాల్గొన్నట్లు ఎస్సై తెలిపారు.

## 'మంజూరైన ట్రైకార్ రుణాలు అందజేయాలి'

మంగపేట, అక్టోబర్ 26 : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 274 మంది ఆదివాసీ గిరిజనులకు మంజూరైన ట్రైకార్ రుణాలను వెంటనే ఇవ్వాలని ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు పోలబోయిన ఆదినారాయణ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. మంజూరైన రుణాలు ఇవ్వాలని కోరుతూ పలుమార్లు అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ రుణాలు విడుదల చేసి, గ్రామీణ ప్రాంత ఆదివాసీలకు బాసటగా నిలవాలని కోరారు. ఆదివాసీ సేన మండల నాయకుడు ఎడం సమ్మయ్య, తుడుందెబ్బ జిల్లా నాయకులు పొడెం నాగేశ్వరరావు, ఎట్టి సారయ్య, లబ్ధిదారులు పూనెం కృష్ణవేణి, పోలెబోయిన వెంకటమ్మ, తెల్లం యాదమ్మ, తాటి అంజలి, దన్నూరి కుమారి, వరప్రసాద్ ఉన్నారు.

## లక్ష్మీపూర్‌తండా అంగన్‌వాడీలో గ్రోత్ మేళా

చిట్యాల, అక్టోబర్ 26 : మండలంలోని లక్ష్మీపూర్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రోత్ మేళా నిర్వహించారు. టీచర్లు రజిత, జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి గ్రామ స్పెషల్ ఆఫీసర్, డాక్టర్ వెంకన్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద హాజరయ్యారు. తక్కువ బరువు ఉన్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేసి కావాల్సిన సమతుల ఆహారం అందించనున్నట్లు తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ రాజేందర్, కార్యదర్శి శ్రీకాంత్, ఏఎన్ఎం స్వరూప, స్కూల్ టీచర్ సౌజన్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-318996

TO-LET



★Commercial Building 3 Floors + Penthouse for Rent, Beside Akshaya Hotel, Jangaon. Ph: 8099573388.
NT-98831

WANTED

★Supervisors, Sales Exicutives, Team Leaders, Dealers for a Car & Bike Polish Company. Free Room & Cooking facility. Ph: 8019399008.
NT-339365-All

★హైదరాబాద్ & తెలంగాణ జిల్లాల్లోని ప్రముఖ టెలికాం టవర్ కంపెనీలో పనిచేయడానికి డిప్లొమా/ ITI చదివిన ఎలక్ట్రీషియన్లు కావలెను. ఫోన్: 9177333978.
WGL-NT-98842

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# గ్రామాల అభివృద్ధే లక్ష్యం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

గణపురం, అక్టోబర్ 26 : గ్రామాల అభివృద్ధే తమ లక్ష్యమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో జెన్కో సీఎస్ఆర్ నిధులు రూ.8.44 కోట్లతో శనివారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మండలకేంద్రం, గాంధీనగర్, సీతారాంపురం, నగరంపల్లి, ధర్మారావుపేట, పరశురాంపల్లి, వెంటేశ్వర్లపల్లి, చెల్పూరు ఎస్సీ కాలనీలో అంగన్‌వాడీ భవన నిర్మాణాలు, ధర్మారావుపేట నుంచి పెద్దాపూర్ వరకు బీటీ రోడ్డు, పరశురాంపల్లి నుంచి బస్వరాజుపల్లి వరకు బీ టీ రోడ్డు, బస్వరాజుపల్లి నుంచి రవినగర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం, బొబ్బలోనిపల్లి నుంచి చెల్పూరు వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడు తూ ఒక్కో అంగన్‌వాడీ భవనానికి రూ.20 లక్షలు, రూ.3.20కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేటీపీపీ సీఈ శ్రీ ప్రకాశ్, ఎంపీడీవో భాస్కర్, తహసీల్దార్ సత్యనారాయణస్వామి, సీడీపీవో పారిజాతం, సూపర్ వైజర్ లక్ష్మి, అప్సర, సొసైటీ చైర్మన్లు కన్నెబోయిన కుమార్‌యాదవ్, సత్యనారాయణరెడ్డి, వైస్‌చైర్మన్ కావటి రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, నాయకులు దూడపాక శంకర్, చోటేమియా, వీడిదినేని అశోక్, నారగాని దేవేందర్‌గౌడ్, మోటపోతుల శివశంకర్‌గౌడ్, కొత్త వెంకన్న, లక్కం రాములు, మార్నేని ఉపేందర్‌రావు, గుజ్జ గంగాధర్‌రావు, చింతిరెడ్డి సమ్మిరెడ్డి, తాళ్లపెల్లి భాస్కర్‌రావు, ఆలూరి కుమారస్వామి, కాల్వ రాంరెడ్డి, మాధం సుధాకర్, జంగిలి సుధాకర్, దాసరి లక్ష్మయ్య, బోనాల రాజమౌళి, సుంకరి సుధాకర్‌రెడ్డి, కటుకూరి శ్రీనివాస్, పిన్నింటి మాధవరావు, అయి తు రమేశ్, ఓరుగంటి కృష్ణ, బోయిని సాంబయ్య, దూడపాక దుర్గయ్య, పాల్గొన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

భూపాలపల్లి రూరల్ : ధాన్యం దిగుబడి ఆధారంగా అవసరమైన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పౌర సరఫరాలు, వ్యవసాయశాఖ అధికారులు చూడాలన్నారు. మద్దతు ధర క్వింటాలుకు గ్రేడ్-ఏ రకానికి రూ. 2320, సాధారణ రకానికి రూ.2300 ఇస్తున్నట్లు తెలిపారు. సన్నరకానికి అదనంగా రూ.500 ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా సివిల్ సప్లై అధికారి శ్రీనాథ్, జిల్లా మేనేజర్ రాములు, డీసీవో వాల్యా నాయక్, ఇన్‌చార్జి డీఆర్డీవో అవినాష్, డీఏవో విజయభాస్కర్, డీఎంవో కనకశేఖర్ పాల్గొన్నారు.

## 29న జాతర వేలం పాటలు

రేగొండ, అక్టోబర్ 26 : బుగులోని వేంకటేశ్వరస్వామి జాతర వేలం పాటలు ఈ నెల 29న నిర్వహించనున్నట్లు ఈవో బిళ్ల శ్రీనివాస్ తెలిపారు. తిరుమలగిరి శివారు పాండవుల గుట్టల్లో ప్రతీ సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజు నుంచి నాలుగు రోజుల పాటు జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నవంబర్ 14 నుంచి 18 వరకు జాతరలో కొబ్బరి కాయలు, పేలాలు, పుట్నాలు, లడ్డూ ప్రసాదం అమ్ముకోవడానికి 29న తిరుమలగిరి జీపీ కార్యాలయంలో వేలం పాటలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని ఆయన సూచించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కాటారం, అక్టోబర్ 26 : మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఎనిమిది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శనివారం మంత్రి శ్రీధర్‌బాబు ప్రభుత్వ వ్యక్తిగత సహాయకుడు ఆకుల చంద్రశేఖర్ అందజేశారు. మంత్రి ఆదేశాల మేరకు ఆయన మండలంలోని గారెపల్లికి చెందిన ఖమ్మంపల్లి విజయకు రూ.60వేలు, మంత్రి నరేశ్‌కు రూ.17,500, కనుకుల అన్విక్ రూ.30వేలు, జాదరావుపేట జీపీ పరిధిలోని ఆకుదారి రవీందర్ రూ.27 వేలు, కత్తరశాలకు రూ.7.500, గుమ్మళ్లపల్లికి చెందిన మంథెన రక్షిత్ చరణ్ రూ.60వేలు, చిద్నెపల్లికి చెందిన లతకు రూ.24వేలు, దామెరకుంటకు చెందిన గౌరమ్మకు రూ. 30 వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

### ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం, అక్టోబర్ 26 : మండల కేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం అందజేశారు. రూ. 1.74లక్షల విలువ చేసే చెక్కులను ఐదుగురికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు చిటమట రఘు, నాయకులు అయూబ్, గౌస్, సులేమాన్, లాలయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

## పోలీసుల సైకిల్ ర్యాలీ

ములుగురూరల్, అక్టోబర్ 26 : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం పోలీసులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మోటర్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ సంతోష్ ప్రారంభించారు. సైకిల్ ర్యాలీలో పాల్గొన్న యువతకు పోలీసులు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ర్యాలీలో ములుగు సీఐ శంకర్, ఎస్సై సీహెచ్ వెంకటేశ్వర్‌రావు, ఆర్ఐ అడ్మిన్ వెంకటనారాయణ, ఆర్ఐవో తిరుపతిరెడ్డి, ఆర్ఎస్సైలు గోపిచందర్, ప్రశాంత్, రాకేశ్, స్పెషల్ పార్టీ హెడ్‌క్వార్టర్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో విత్తనాలు : డీఏవో

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 26 : జిల్లాలో యాసంగి సీజన్‌కు సంబంధించిన విత్తనాలు, మందులు రైతులకు అందుబాటులో ఉంచామని డీఏవో విజయభాస్కర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడారు. వానకాలం సీజన్‌లో రైతులు 2.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారని తెలిపారు. యాసంగి సీజన్‌లో సుమారు 85 వేల ఎకరాల్లో వరిని సాగుచేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో దాదాపు 36 వేల మందికి రుణమాఫీ జరిగిందని, ఇంకా 17 వేల మందికి జరుగాల్సి ఉందన్నారు. జిల్లాలో 3500 ఎకరాల్లో ఆయిల్‌పామ్‌ను రైతులు సాగుచేస్తున్నారని, త్వరలో జిల్లాకు ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ రాబోతున్నదన్నారు. పంటల నమోదును పారదర్శకంగా చేస్తున్నామని, నెల రోజుల్లో డిజిటల్ సర్వేను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

## వృద్ధురాలిని చేరదీసిన 'సఖీ'

చిట్యాల, అక్టోబర్ 26 : మండలంలోని గిద్దముత్తారం బస్సు షెల్టర్‌లో పది రోజులుగా ఓ వృద్ధురాలు ఉంటున్నదని శనివారం గ్రామానికి చెందిన బైరి కుమార్, హరీశ్‌గౌడ్ మహిళా హెల్ప్ లైన్ 181కి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే భూపాలపల్లి జిల్లా సఖి సెంటర్ కోఆర్డినేటర్ అడ్మినిస్ట్రేటర్ గాయత్రి అక్కడికి వచ్చి విచారణ చేయగా మహిళ మతిస్థిమితం కోల్పోయి ఉందని గమనించిన జిల్లా సఖి సెంటర్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో బాధిత మహిళలు తమ సమస్యల పరిష్కారానికి సఖి సెంటర్‌ను ఆశ్రయించాలని సూచించారు. సెంటర్‌కు రాలేనివారు 85000 09433 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మల్టీ పర్పస్ సుమలత, డ్రైవర్ కుమార్ పాల్గొన్నారు.

## రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

గణపురం, అక్టోబర్ 26 : రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గణపురం పీఏసీఎస్ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రైతులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచుతున్నదన్నారు. ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, వరి పంటకు అన్ని రకాల ధాన్యానికి 500 బోనస్ ఇవ్వాలన్నారు. రెండు పంటలకు పెట్టుబడి సాయం ఎకరాకు రూ.15 వేలు తక్షణమే రైతుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. భూమిలేని నిరుపేదలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇవ్వాలని, రూ.3 లక్షల వరకు వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రానున్న రోజుల్లో రైతుల పక్షాన పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

## ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతగా పనిచేయాలి

### కలెక్టర్ టీఎస్ దివాకర



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగురూరల్, అక్టోబర్ 26 : ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో బాధ్యతగా, అంకితభావం, సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో కలెక్టర్ అదనపు కలెక్టర్ సంపత్‌రావు, డీపీవో దేవరాజ్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 31వసతి గృహాల్లో అత్యవసరమైన మూడు పనులకు తక్షణమే నివేదిక సిద్ధం చేయాలని, ఆ పనులను మూడు రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు హాస్టల్స్, పాఠశాలలను తనిఖీ చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో నీటి సరఫరాపై అధికారులు దృష్టి సారించాలన్నారు. నీటి లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని కులాల సామాజిక వర్గాలకు సంబంధించిన ఆర్థిక, సామాజిక, రాజకీయపరమైన సమస్యలపై మండలకేంద్రాల్లో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు.

## విద్యార్థులు ఇష్టంతో చదవాలి

### భూపాలపల్లి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి



విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 26 : ప్రభుత్వం అందించే సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థులు ఇష్టంతో చదివి మంచి స్థానంలో ఉండాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. శనివారం ఆమె భూపాలపల్లి మండలం గొల్లబుద్దారం ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుకున్నారు. పాఠశాలలో కొనసాగుతున్న ఎస్ఏ-1 పరీక్షలను పరిశీలించారు. ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలు గతవారం విద్యార్థులకు కోడిగుడ్డు అందించలేదని తెలుపగా ఏజెన్సీ వారికి ఫోన్ చేసి మరొకసారి జరిగితే తొలగిస్తామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితిలో వారానికి మూడు రోజులు కోడిగుడ్లు అందించాలని సూచించారు. విద్యార్థుల మరుగుదొడ్లను పరిశీలించి ప్రతిరోజు బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మండల రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో, పంచాయతీ సెక్రటరీ, ఉపాధ్యాయురాలు మానస పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



భూపాలపల్లిలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 26 : పెండింగ్ స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాజు అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. తక్షణమే విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విద్యాభివృద్ధికి తోడ్పడాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస నరేశ్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎస్ఎఫ్ఐ కమిటీ కార్యదర్శి నిఖిల్, ఎస్ఎఫ్ఐ సంఘమిత్ర డిగ్రీ కళాశాల కమిటీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### బకాయిలు వెంటనే ఇవ్వాలి..

మహదేవపూర్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు వెంటనే చెల్లించాలని ఏబీవీపీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా బకాయిలు చెల్లించకుండా పేద విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటుదని మండిపడ్డారు. కార్యక్రమంలో మహదేవపూర్ నగర కార్యదర్శి పేట సాయి, నాయకులు రాజేశ్, అజయ్, అరుణ్, ప్రకాశ్, పాల్గొన్నారు.

## ఏటీసీ కోర్సులతో ఉపాధి అవకాశం

ములుగురూరల్, అక్టోబర్ 26 : అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్(ఏటీసీ) కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు పొందవచ్చని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కొప్పుల మల్లేశం అన్నారు. శనివారం కళాశాలలో విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏటీసీ కోర్సులలో భాగంగా ఆరు కోర్సులను ఏటూరునాగారం ఐటీఐ కళాశాలలో అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. గ్రామాల్లో 10వ తరగతి ఉత్తీర్ణులు అయిన విద్యార్థులు ప్రవేశాలు పొందవచ్చని సూచించారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు కవిత, భాస్కర్, రాధిక, సరిత, నాగమణి, విజేత, ఉదయశ్రీ, శంకర్, తేజోలత, శ్రీను, మౌలాన, అనిత, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సర్ఫేస్ విభాగంలో అవకాశం

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 26 : సర్ఫేస్ విభాగంలో అర్హత, ఆసక్తి గల మహిళలకు అవకాశం కల్పిస్తున్నామని భూపాలపల్లి ఎస్‌వోటు జీఎం కవీంద్ర అన్నారు. శనివారం భూపాలపల్లి ఏరియాలో పని చేస్తున్న బదిలీ వర్కర్, జనరల్ మజ్దూర్ మహిళా ఉద్యోగులకు సర్ఫేస్ ఉద్యోగాల కోసం మైన్స్ రెస్క్యూ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించగా కవీంద్ర హాజరై మాట్లాడారు. సర్ఫేస్ విభాగంలోని 16 డిజిగ్నేషన్లలో అర్హత, ఆసక్తి గల మహిళలకు అవకాశం ఇస్తున్నామని, దీనిని మహిళా ఉదోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. ఏజీఎం ఎస్ జ్యోతి, ఏసీఎంవో ఎస్ పద్మజ, పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, ఎంవీటీసీ మేనేజర్ రామన్ పాటక్, డీవైపీఎం గుండు రాజు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ డీ సంజీవరావు పాల్గొన్నారు.

## 29 నుంచి కబడ్డీ పోటీలు

కాటారం, అక్టోబర్ 26 : ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో డివిజన్ స్థాయి కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు డివిజన్ కార్యదర్శి బొడ్డు కిశోర్ తెలిపారు. మండలకేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నిర్వహించే పోటీల్లో ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందించనున్నట్లు చెప్పారు.

# పాలంపేటలో న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూర్యచంద్రకళ

వెంకటాపూర్, అక్టోబర్ 26 : పాలంపేటలో ములుగు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పాన్ ఇండియా రెస్క్యూ అండ్ రెహాబిలిటేషన్ చైల్డ్ లేబర్ క్యాంపెయిన్ ప్రోగ్రాంలో భాగంగా భవన నిర్మాణ కార్మికులతో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్‌వీపీ సూర్యచంద్రకళ పాల్గొని మాట్లాడారు. బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. లేబర్ కార్డు ప్రయోజనాలు, ఈ శ్రమ్ కార్డుపై వివరించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నంబర్ 15100 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉచిత న్యాయ సలహా కోసం 15100 ఫోన్ చేయవచ్చన్నారు. అనంతరం రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ బీపీ ఆచార్య, ప్రొఫెసర్ పాండురంగారావు, అధికారులతో కలిసి రామప్ప ఆలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో అదనపు సివిల్ జడ్జి జే సౌఖ్య, అసిస్టెంట్ వీ వినోద, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం వినయ్ కుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీ శ్యామ్‌ప్రసాద్, జనరల్ సెక్రటరీ సునీల్‌కుమార్, న్యాయవాదులు సీహెచ్ వేణుగోపాలాచారి, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బానోత్ స్వామిదాస్, రాజ్‌కుమార్, ఎస్సై జక్కుల సతీశ్, డీసీపీవో ఓంకార్, భవన కార్మికులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## గుడిసెలు కూల్చడం దారుణం

ములుగురూరల్, అక్టోబర్ 26 : ఇంచర్ల గ్రామంలోని ఎర్రగట్టమ్మ వద్ద పేద ప్రజలు గత ఆరేండ్ల నుంచి నివాసం ఉంటున్న గుడిసెలను అధికారులు కూల్చడం దారుణమైన చర్య అని బీఆర్ఎస్ నాయకులు గోవింద్‌నాయక్, పాలెపు శ్రీనివాస్ అన్నారు. శనివారం వారు బాధితులను కలిసి మాట్లాడారు. అధికారులు పోలీసులతో కలిసి గుడిసెలు కూల్చడం దారుణమన్నారు. ఎన్నికల ముందు గుడిసె వాసులకు ఇచ్చిన హామీ మరిచి మంత్రి సీతక్క అధికారులను పంపించి గుడిసెలను కూలగొట్టించారని ఆరోపించారు. కుటుంబానికి గుంటన్నర భూమిని అందించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## ములుగులో ఓంకార్ వర్ధంతి

ములగురూరల్, అక్టోబర్ 26 : ఎంసీపీఐ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతిని శనివారం ములుగు జిల్లా కేంద్రంలో ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ మేరకు ఓంకార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర కమిటీ సభ్యుడు కుమారస్వామి మాట్లాడుతూ భారత సమాజాన్ని అంబేద్కర్ ఆలోచన విధానంతో నిర్మూలించే దిశగా ఎంసీపీఐ పార్టీ ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, సుధాకర్, రాజన్న, ఆదిరెడ్డి, రామిరెడ్డి, మల్లయ్య, రాజన్న, రాజమౌళి, రవి, కొమురయ్య, చిన్న మల్లయ్య ఉన్నారు.

## పంచాయతీ కార్మికులకు చీరెలు పంపిణీ

ఏటూరునాగారం, అక్టోబర్ 26 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు శనివారం స్థానిక ఎస్సై తాజుద్దీన్ చీరెలు పంపిణీ చేశారు. పంచాయతీ కార్మికులు అందిస్తున్న సేవలను గుర్తించిన ఆయన చీరెలు పంపిణీ చేశారు. రోడ్లపై ఎక్కువగా చెత్తాచెదారం పడేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

## పాఠశాలలో పాము కలకలం

వెంకటాపురం(నూగూరు), అక్టోబర్ 26 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో తరగతి గదిలో పాము ప్రవేశించి కలకలం రేపింది. ఉదయం పాఠశాల గదులను శుభ్రం చేస్తుండగా కట్ల పాము కనిపించడంతో గదులను శుభ్రం చేసే సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. కేకలు వేయడంతో ఉపాధ్యాయులు క్లాస్ రూమ్‌కు వచ్చి కట్ల పామును చూసి అటవీశాఖ అధికారులకు సమాచారమందించారు. అప్పుడే అక్కడికి చేరుకున్న గ్రామస్తులు పామును కొట్టి చంపారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఊపిరి పీల్చుకున్నారు.

## మేకల మృత్యువాత

ఏటూరునాగారం, అక్టోబర్ 26 : నిరంతరం విరేచనాలు కావడంతో మేకలు మృత్యువాత పడుతున్నాయి. మండలంలోని రామన్నగూడెం గ్రామానికి చెందిన పోతరాజు కుమారస్వామికి చెందిన రెండు మేకలు వరుసగా విరేచనాలు కావడంతో మృత్యువాత పడ్డాయి. శనివారం ఉదయం విరేచనాలకు గురవుతున్న మేకను మండల కేంద్రంలోని పశువైద్యశాలకు తీసుకురాగా వైద్యులు లేరన్నారు. కాంపౌండర్ సెలెన్ పెట్టారని, కొద్ది సేపటి తర్వాత మేక చనిపోయినట్లు బాధితుడు కుమారస్వామి తెలిపారు. సరైన వైద్యం అందకపోవడం వల్లనే మేక చనిపోయిందని ఆయన వాపోయారు. వైద్యులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని ఆయన కోరారు.

## కొత్త పింఛన్లు మంజూరు చేయాలి

చిట్యాల, అక్టోబర్ 26 : అర్హులైన దివ్యాంగులకు కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాట మార్చాయని ఆ సంఘం నాయకుడు పుల్ల మల్లయ్య అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో పింఛన్లతో పాటు సంక్షేమ పథకాలు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని ఆయన కోరారు.

## లక్ష్మీదేవర ఆలయంలో అభివృద్ధి పనులు

మల్హర్, అక్టోబర్ 26 : మండలంలోని ఎడ్లపల్లి లక్ష్మీ దేవర ఆలయంలో ఆలయ పునరుద్ధరణ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామానికి చెందిన దాత సహకారంతో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో ఆలయంలో ఫ్లోరింగ్, గ్రానైట్ పనులు శనివారం పూర్తయ్యాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జనగాం స్వరూపా బాపు, అక్కినవేని నాగయ్య, ఆలయ పూజారి చిన్న కిష్టయ్య, పిట్టల మల్లేశ్, బొందాలు, వికాస్ రాజు, ఉరవేద్ది సమ్మయ్య, జంగ రమేశ్, మాంతయ్య, శ్రీను, సుమన్, కిరణ్, మేకల రాజు, సతీశ్ పాల్గొన్నారు.

## పంటలను పరిశీలించిన తహసీల్దార్

మహాముత్తారం, అక్టోబర్ 26 : ఇటీవల ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను శనివారం తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. మహాముత్తారం శివారులో వరి దెబ్బతిన్నట్లు రైతులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి ఆయన రైతులతో కలిసి నేలకొరిగిన వరిని పరిశీలించారు. వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరుపున నష్టపరిహారం వచ్చేలా చూస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట యామన్‌పల్లి గ్రామానికి చెందిన కాటంరాజు, రైతులు గోపినవేన దేవేందర్, సమ్మయ్య, రామటెంకి లచ్చయ్య, నాయకులు అట్టెం రమేశ్ ముదిరాజ్, హట్కర్ రాకేశ్, గోగికార్ రామోజీ, రత్నం రాజయ్య, నర్సయ్య ఉన్నారు.

## గ్రామాల్లో డిజిటల్ క్రాప్ సర్వే

మహదేవపూర్, అక్టోబర్ 26 : మండలంలోని సూరారం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం డిజిటల్ క్రాప్ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా రైతుల పంటల వివరాలు, విస్తీర్ణం తదితరులు అంశాలను ట్యాబ్‌లో నమోదు చేశారు. సర్వే చేస్తున్న క్రమంలో కొన్ని ప్రదేశాల్లో ఆన్‌లైన్‌లో ఫీల్డ్ ఒక చోట, లొకేషన్ మరో చోట చూపడంతో సర్వే అధికారులు ఇబ్బందులకు గురైయ్యారు. కార్యక్రమంలో ఏఈవో రచన, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రుక్సానా మహ్మద్‌కు డాక్టరేట్

భూపాలపల్లి రూరల్, అక్టోబర్ 26 : భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న రుక్సానా మహ్మద్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కామర్స్ విభాగంలో డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. రిటైర్డ్ ప్రొఫెసర్ శంకరయ్య పర్యవేక్షణలో 'కార్పొరేట్ ఎన్విరాన్‌మెంట్ అకౌంటింగ్ ప్రాక్టీసెస్ ఏ స్టడీ ఇన్ సెలెక్ట్ కంపెనీస్' అనే అంశంపై పరిశోధన చేసి ఈ నెల 25న యూనివర్సిటీ కామర్స్ చైర్మన్ బోర్డు ఆఫ్ స్టడీస్ ప్రొఫెసర్ కృష్ణ చైతన్య చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. శనివారం ఆమెను చైర్మన్‌తో పాటు, డిపార్ట్మెంట్ హెడ్, కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు, తోటి అధ్యాపకులు అభినందించారు.

## రేపు జీపీ గదులకు వేలం

టేకుమట్ల, అక్టోబర్ 26 : మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్ ఐదు షెటర్లకు రెండేళ్లు (2024-2026) కిరాయి ఇవ్వడానికి సోమవారం వేలం పాట నిర్వహించనున్నట్లు కార్యదర్శి శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## లారీ, జేసీబీ సీజ్

టేకుమట్ల, అక్టోబర్ 26 : కలికోటపల్లి మానేరు వాగు నుంచి శుక్రవారం రాత్రి ఇసుకను తరలించేందుకు వాగులోకి వెళ్లిన లారీ, జేసీబీని పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. లారీ డ్రైవర్ సిర్థార్, క్లీనర్ చంద్రకాంత్ బిలోలి, జేసీబీ డ్రైవర్ యూసఫ్‌ఖాన్, ఓనర్ కోటిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ స్థానిక అవసరాలకు మినహా ఎవరైనా ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.